


# ఎన్నిక

పాలడుగు వెంకటేశ్వరరావు

అప్పుడూ, ఇప్పుడూ కూడా –

బండిపాలెం ఒక గ్రామం. ఒకప్పుడు–

ఆ ఊరికి ఒక దారీ డొంకా లేదు !

ఒక 'మరుగుస్థలం' లేదు. కరెంటు లేదు. మంచినీటి సప్లయి లేదు. హాస్పిటలు లేదు. లైబ్రరీ లేదు. అట్లాంటిది –

ఒకప్పుడు కాకతాళీయంగా ఆ పంచాయతీ ప్రెసిడెంటుగా సూర్యం ఎన్నికయాడు ! ఆ ఊళ్ళో అప్పుడూ ఇప్పుడూ రెండు బలమయిన పార్టీలున్నాయి. ఒకదానికి మున్సబుగారు లీడరు. రెండోదానికి సత్యంగారు లీడరు. ఆ రెండు పార్టీలమధ్య పోటీ వచ్చి అప్పుడు సూర్యం ప్రెసిడెంటు అయ్యాడు.

ప్రెసిడెంటు అయీ అవగానే కొందరు యువకుల్ని పోగేసి శ్రమదానంతో ఆ ఊర్నించి పట్నంపోయే రోడ్డుని కలిపే అరమైలు లింకురోడ్డు వేయించేడు. బంజరుస్థలం చుట్టూ గోడ కట్టించి స్త్రీలకి మరుగుస్థలం ఏర్పాటు చేశాడు. ఊరి చెరువు చుట్టూ కంచె వేయించాడు. ఊళ్ళో

నాలుగయిదు స్థలాల్లో పంపులు పెట్టించేడు. కాలికి బలపంకట్టుకుని తిరిగి ఊరికి కరెంటు తెప్పించేడు. బలహీన వర్గాలవారికి ఇళ్ళస్థలాలు యిప్పించేడు. హరిజనవాడలో కమ్యూనిటీ రేడియో పెట్టించేడు. లైబ్రరీ పెట్టించేడు.

ఊరులో వచ్చిన ఆ మంచిమార్పులు మున్సబుగారికి, సత్యంగారికి ఇద్దరికీ నచ్చేయి. కానీ ఆ ఇద్దరిలోనూ సూర్యం మీద అకారణవైరం పొడసూపింది.

అందువలన ఇద్దరూ కలిసి ఊరికి హాస్పిటల్ తీసుకునివచ్చే సూర్యం ప్రయత్నాన్ని వమ్ముచేసారు. ఆ మరుసటి సంవత్సరమే ఆతన్ని ఆ పదవినుంచి దించటంలో కృతకృత్యులూ అయేరు.

అప్పుడు మున్సబుగారు ప్రెసిడెంటు అయేరు.

సత్యంగారు వైస్‌ప్రెసిడెంటయేరు.

అయితే – ఆర్నెల్లయినా తిరక్కుండా వారిలో వారికి స్పర్థలు వచ్చాయి. లింకురోడ్డు గుంటలు పడింది. మరుగు స్థలం గోడ కూలగొట్టారు. మంచినీళ్ళ పంపులు చెడిపోయేయి. లైబ్రరీ మూత పడింది. రేడియో నోరులేనిదయింది.

సత్యంగారు 'నో కాన్ఫిడెన్సు' మోషన్ పెట్టి మున్సబుని పదవినించి దించే ప్రయత్నంలో పడ్డారు. మున్సబు గారూవూరుకోలేదు. కోర్టులకెక్కిన ఊరి రాజకీయాలు పట్నంలో బజార్న పడ్డాయి – అకారణంగా.

ఊళ్ళో కుర్రకారు ఇదంతా చూసి చిరాకుపడి సూర్యందగ్గర కొచ్చారు. 'పార్టీలు లేవు. ఏమీలేవు. ఊరు బాగో గుతే మాకు కావాలి. కనుక మునసబు గారిని, సత్యంగారిని పదవుల్నించి దించేద్దాం. మీరు ప్రెసిడెంటుగా ఉండండి' అని అడిగారు సూర్యాన్ని.

'వుండను' అన్నాడు సూర్యం నిశ్చింతగా.

'అదేమిటి ?! మా ఆశలన్నీ మీ మీదే పెట్టుకున్నాం గదా !' అని అన్నారు వాళ్ళు.

'ఎందుకని ?' అని అడిగాడు సూర్యం

'ఊరు చెడిపోతోంది. ఇలాగ అయితే ఏం బాగాలేదు' అన్నారు వాళ్ళు.

'అయితే...?'

'దాన్ని బాగుచెయ్యాలి '

'అందుకని...?'

'మీరు ప్రెసిడెంటవాలి. మీకు మా అందరి సపోర్టు ఉంది.'

'ఊరు బాగవాలంటే నేను ప్రెసిడెంటవనవసరంలేదు. మీరు నా వెనకాల నిలబడండి చాలు. మనూర్ని బాగు చేద్దాం ' అన్నాడు సూర్యం. వాళ్ళలో మున్సబు కొడుకూ, సత్యం కొడుకూ కూడా ఉన్నారు.

'మేమందరం మీ వెనకాలె

నిలబడ్డాం,' అన్నారందరూ ఏకకంఠంతో.

'అయితే మనందరికీ మనూరు బాగుపడాలన్నదే ధ్యేయం అవునా ?'

'అవును.'

'అందుకని మనమే పూనుకొందాం, ఆ పనికి.' అన్నాడు సూర్యం.

సరేనంటే సరేనన్నారు. యువకులంతా భుజం భుజం కలిపి బయలుదేరారు. వాళ్ళే శ్రమదానంచేసి లింకు రోడ్డు గుంటలు పూడ్చారు. మరుగుస్థలంచుట్టూఉన్న ప్రహరీగోడని మరల కట్టారు. మంచినీళ్ళ పంపుల్ని మరామత్తు చేయించారు. లైబ్రరీ తెరిపించారు. విరాళాలు వేసుకుని హాస్పిటల్ కట్టించి గవర్నమెంటు నుంచి డాక్టర్ని తెచ్చుకున్నారు. సహకార సంఘంగా ఏర్పడి, ఋణాలు తెచ్చి పౌల్ట్రీఫారాలు, డైరీ ఫారాలు పెట్టి లాభాలు గడించారు. ఊరు కలకలలాడింది.

ఈ మధ్యలో రెండుమూడేళ్ళుగా — ఐ స్త్రీలో అల్లుడింట్లో మున్సబుగారూ — కొడుకింట్లో సత్యంగారూ మకాం పెట్టి ఎటూ తేలని దావాతో, కోర్టుల్తో, ప్లీడర్లతో మొహంమొత్తి చేతిచమురు వదల్చుకుని తిరిగి ఆ ఊరుచేరిన ఆ పెద్దలు ఇద్దరూ ఆశ్చర్యపోయారు ! —పోయి ఆలోచనలోనూ పడ్డారు. పశ్చాత్తాపపడ్డారు కూడా. పడి గుంపు చింపులుపోయి చివరికి ఇద్దరూ కలిసి సూర్యం దగ్గరకొచ్చారు. వచ్చి —

'సూర్యం - మా తరం అయిపోయిందయ్యా. బరువు బాధ్యతలు ఇక మీ యువకుల భుజాలమీదే పెడ్దామనుకుంటున్నాం' అన్నారు ముక్తకంఠంతో, ఇద్దరూ

సూర్యం నవ్వాడు. 'కావాలంటే జనరల్ బాడీని పిలిచి నిన్ను ఎన్నుకుంటాము-కనక ఇవాళ్టినుంచి మనూరి ప్రెసిడెంటు నువ్వే' అని ఏకకంఠంతో అన్నారు.

'క్షమించండి' అన్నాడు సూర్యం.

'అదేమిటి ?!' అంటూ ఆశ్చర్యపోయారు మున్సబూ-సత్యమూ.

'మేం కుర్రాళ్ళం ! పదవులు మాకొద్దు, అవి మీరే ఉంచుకోండి. బరువు బాధ్యతలు మాత్రం ఏమయినావుంటే మాకు అప్పచెప్పండి. మన ఊరి మంచికోసం మేం ఏంచేసినా మాకు మీ సహకారం ఇవ్వండి. అది చాలు. అంతా మనూరి మంచికోసమే అని గ్రహించి అందరం కలిసిమెలిసి నడిస్తేనే మంచి' అన్నాడు, సూర్యం.

'శభాష్' అని సూర్యం భుజంతట్టి నవ్వుకుంటూ భుజం భుజం కలిపి నడుస్తూ ఖలాసాగా కబుర్లు చెప్పుకుంటూ చుట్టలు కాల్చుకుంటూ వెళ్ళారు ప్రెసిడెంటయిన మున్సబుగారూ, వైస్ ప్రెసిడెంటయిన సత్యంగారూ. తప్పలేదు! ఆ మరుసటి ఏడే 'బండిపాలెం ఉత్తమ పంచాయతీగా 'ఎన్నిక'' అయింది !!!

———